సాక్షి పెద్దపల్లి

బుధవారం ; 26 ; ఏప్రిల్ ; 2023



కలెక్టర్‌తో డైరెక్టర్ల సమావేశం

సింగరేణి ప్రాజెక్టుల విస్తరణ, భూ అనుమతులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం మంగళవారం జిల్లాలోని అన్ని ఏరియాల జీఎంలు, డైరెక్టర్లు కలెక్టర్ సంగీతతో సమావేశమయ్యారు. 8లో▸



విజిలెన్స్ నియామకం ఎప్పుడో..?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీ (విజిలెన్స్)లు నామ మాత్రమయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

33.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికం గా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పరిశుభ్రతతోనే మలేరియా దూరం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

పెద్దపల్లిరూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మలేరియా దరి చేరదని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. మలేరియాపై అవగాహన ర్యాలీని జిల్లాకేంద్రంలో జెండాఊపి ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, అవసరమైన మందులు కూడా అందిస్తారని పేర్కొన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. తాగిపారేసిన కొబ్బరిబొండాలను ముక్కలుగా చేసి చెత్తకుండిలో వేయాలన్నారు. మలేరియా నివారణ అధికారి రాజమౌళి, కంటివెలుగు నోడల్ అధికారి మహేందర్, మెడికల్ ఆఫీసర్ లావణ్య, శ్రావణ్, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

నేడు జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకావిష్కరణ

పెద్దపల్లిరూరల్: జిల్లాల చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, సంగీతం, నాటకం, పర్యాటక ప్రదేశాలు తదితర అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందిస్తున్న జిల్లా సమగ్ర స్వరూప పుస్తకావిష్కరణను ట్రినిటి డిగ్రీ కాలేజీలో బుధవారం ఆవిష్కరిస్తున్నట్లు రచయితల వేదిక రాష్ట్ర ప్రచార కార్యదర్శి కూకట్ల తిరుపతి తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిషత్ అధ్యక్షుడు శివారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.


రామానుజుల శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న చాత్తద శ్రీవైష్ణవ సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామానుజుల జయంతి శోభాయాత్ర నిర్వహించారు. వెయ్యేళ్ల క్రితమే ధర్మశాస్త్రం, వైష్ణవ సంప్రదాయం, సంస్కృతితత్వం బోధించారని శ్రీవైష్ణవసంఘ అధ్యక్షుడు బండవరం సుమన్, శ్రీకాంత్ పేర్కొన్నారు. శ్రీసీతారామస్వామి ఆలయం నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. సంఘ నాయకులు నేరెడుకొమ్మ గోవర్దన్, సందీప్, శ్రీనివాసమూర్తి, శ్రీనివాసస్వామి, నరసింహస్వామి, కోదండరాం, వెంకన్న, రఘు, మాధవ్, శ్రీవాణి, రవి తదితరులున్నారు.

వర్షానికి ఓసీపీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



ఓసీపీల్లో నిలిచిపోయిన దంపర్లు

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి నాలుగు ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–5 ఓసీపీ, ఆర్జీ–2 ఏరియాలోని ఓసీపీ–3, ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1, 2లో రెండోషిఫ్టులో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. అలాగే ఓబీ వెలికితీత నిలిచిపోయింది. స్టాక్‌యార్డ్ నుంచి బొగ్గును తరలించే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. పరిస్థితి ఇలాగే ఉంటే నైట్ షిఫ్టులో కూడా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

'భరోసా సభ'కు సిద్ధం కండి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. బీఎస్పీ ఆధ్వర్యంలో మే 7న నిర్వహించే తెలంగాణ భరోసా సభకు పెద్ద ఎత్తున బహుజనులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఆర్టిజన్ కార్మికులు తలపెట్టిన సమ్మెకు బీఎస్పీ మద్దతు ఇస్తోందన్నారు. నాయకులు చంద్రశేఖర్, సవిత, వెంకటేశ్, రాజనర్సయ్య, తిరుపతి, శేషాద్రి, మల్లేశం, దుర్గయ్య, గోపాల్, శోభ, అరుణ, శారద, మధు, రాజబాబు కొమురయ్య, రవికుమార్ తదితరులున్నారు.



మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొట్టుకుపోతున్న ధాన్యం



ధర్మారం మార్కెట్‌లో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతు



మంథనిలో రైతుల దుస్థితి..

గాలివాన బీభత్సం

● ధర్మారం మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యం ● కేంద్రాల్లో టార్పాలిన్లు లేక తడిసి ముద్దయిన వైనం

మంథని/ధర్మారం: ధర్మారం మండలంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన వర్షం రైతులను ఆగం చేసింది. భారీవర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడిసిపోయింది. మండలంలో ఏర్పాటు చేసిన దాదాపు 15 కేంద్రాలకు ధాన్యం వచ్చింది. మూడు రోజులుగా వర్షం వస్తుందనే భయంతోనే రైతులు ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పుకున్నారు. ఉన్నట్టుండి భారీ వర్షం.. ఈదురుగాలులకు టార్పాలిన్లు కొట్టుకుపోయాయి. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడం.. ఉన్న కొద్దిపాటి కవర్లు కొట్టుకుపోవడంతో ధాన్యం నీటిపాలైంది. ధర్మారం మార్కెట్‌లో పోసిన ధాన్యం వరదలో కొట్టుకుపోయింది.

మంథని రైతులను ముంచుతున్న మార్కెట్ యార్డు..

మంథని రైతులను వ్యవసాయ మార్కెట్ యార్డు నిండా ముంచుతోంది. సిమెంట్ ప్లాట్‌ఫాం, చుట్టూ ప్రహరీ ఉండడంతో ధాన్యానికి రక్షణగా ఉంటుందని రైతులు యార్డుకు తమ పంటను తీసుకొస్తుంటారు. ఇలా అకాలవర్షానికి ప్రతిసారీ నష్టపోతున్నారు. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కూడా మార్కెట్‌లోని ధాన్యం కొట్టుకుపోయింది. స్థానిక మార్కెట్‌లో శనివారం కొనుగోళ్లు ప్రారంభమై.. సోమవారం నుంచి కాంటా పెట్టారు. దీంతో మంథనితోపాటు ఎక్లాస్‌పూర్, సూరయ్యపల్లి, గంగాపురితోపాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు ఇక్కడకే ధాన్యానికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం వర్షార్పణమైంది. ధాన్యం రాశుల చుట్టూ నీరు నిలిచింది. కాలువ సమీపంలో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. రైతులు చేరుకుని కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. యార్డులో 80 నుంచి 90 మంది రైతులకు చెందిన సుమారు 100 వరకు రాశులు ఉన్నాయి. ఈ మొత్తం నాలుగు వేల క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా.



మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరదనీటి ఉధృతి



ప్రతీ సీజన్‌లో నష్టమే..

వర్షం రాదని భావించి మార్కెట్‌కు ధాన్యం తెస్తున్నం. ఆరబెడుతున్నం. ప్రతిసీజన్‌లోనూ ఇలాగే అకాలవర్షం వస్తోంది. ధాన్యం మొత్తం కొట్టుకుపోతోంది. ఏటా ట్రాక్టర్ లోడ్ వడ్లు నష్టపోతూనే ఉన్నా. ఇవ్వాల కూడా అదే జరిగింది. నాతోపాటు చాలా మంది రైతులు వడ్లు కొట్టుకుపోయినయ్.

– శీలం సత్యనారాయణ, రైతు, ఎక్లాస్‌పూర్, మంథని



శ్రమంతా నీటి పాలైంది

నాలుగు నెలలు కుటుంబమంతా కలిసి కష్టపడితే పండిన పంట గంటసేపు వచ్చిన వర్షానికి నీటిపాలైంది. రెండురోజుల క్రితం ధాన్యాన్ని విక్రయించేందుకు ధర్మారం మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన మబ్బులు రావటంతో జాగ్రత్తగా కవర్లు కప్పిన. వర్షానికి రేకులపై నుంచి వచ్చిన నీటికి సుమారు నాలుగు క్వింటాళ్ల వడ్లు కొట్టుకుపోయినయ్.

– వేల్పుల నది, ధర్మారం

బీఆర్‌ఎస్‌లో ప్లీనరీ జోష్..!



జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్లీనరీలో మాట్లాడుతున్న ఎంపీ వెంకటేశ్ నేత



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

- మూడు నియోజకవర్గాల్లో ముఖ్య ప్రతినిధుల సమావేశాలు
- కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేసేలా నేతల ప్రసంగాలు
- ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్‌లు, నోరూరించిన వంటకాలు

సాక్షి, పెద్దపల్లి: ప్లీనరీ సమావేశాలు అంటే సాధారణంగా ఆవిర్భావ వేడుకల సందర్భంగా పార్టీలు రాష్ట్రస్థాయిలో నిర్వహించుకుంటాయి. ఆయా పార్టీలు ప్రభుత్వం, పార్టీ పరంగా తీసుకున్న నిర్ణయాలు, తీసుకోబోయే అంశాలపై చర్చిస్తాయి. అయితే మొదటిసారిగా బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయిలో ప్లీనరీలు ఏర్పాటు చేయడం.. అందులో పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులతో 18 అంశాలపై తీర్మానాలు చేయించి.. వాటిని బలపరిచి.. ఆమోదించుకుంది. ఇలా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్లీనరీ పార్టీ నేతలు.. కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపింది. మొత్తంగా ప్లీనరీలు విజయవంతం అయ్యాయి. పెద్దపల్లిలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండంలో కోరుకంటి చందర్, మంథనిలో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అధ్యక్షతన మంగళవారం నియోజకవర్గ స్థాయి ముఖ్యప్రతినిధుల సమావేశాలు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు పార్టీ జెండాలను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి, అమరవీరుల స్తూపాల వద్ద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రానున్న ఎన్నికల క్షేత్రంలో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఎగిరేలా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఆశావహులు దూరం

రామగుండం నియోజకవర్గ ప్లీనరీకి అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్న నాయకులు దూరంగా ఉన్నారు. తమకు సమాచారం లేదని సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశమైంది. మంథనిలో కాటారం జెడ్పీటీసీ చల్లా తిరుపతిరెడ్డి మాట్లాడే సమయంలో కొందరు కార్యకర్తలు అడ్డుకోబోయారు. ఇలాంటి చిన్నచిన్న సంఘటనలు మినహా మూడు నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్లీనరీలు కార్యకర్తల్లో ఫుల్ జోష్ నింపాయి. రానున్న ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేసేలా సాగాయి.

ఆహా.. అనిపించేలా వంటకాలు

సమావేశానికి వచ్చిన కార్యకర్తలకు మటన్, చికెన్‌తో కూడిన భోజనాలు ఏర్పాటు చేశారు. ఎండ తాపం నుంచి ఉపశమనం కోసం చల్లా, వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు. సమావేశాల ప్రాంగణాల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు, తీర్చిన సమస్యలను ఫొటోలతో ప్రదర్శించారు.

గులాబీవనంగా ప్రాంగణ పరిసరాలు

మూడు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నేపథ్యంలో వివిధ మండలాల నుంచి నియోజకవర్గకేంద్రాలకు వచ్చే కార్యకర్తలకు ఘన స్వాగతం పలికేలా భారీ ఫ్లెక్సీలు, గులాబీ జెండాలు, తోరణాలతో నిండిపోయాయి. గ్రౌండ్ చుట్టుపక్కల భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. నేతల ప్రసంగాలు అందరికీ వినపడేలా సౌండ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.

ఏకతాటిపైకి తెచ్చేందుకే..

– వెంకటేష్‌నేత, ఎంపీ

నోట్ల కట్టలతో ఓట్లు దండుకునే కాంగ్రెస్‌ను.. మతం ముసుగులో చిచ్చుపెట్టే బీజేపీని తరిమికొట్టాల్సిన రోజులు దగ్గరలోనే ఉన్నాయి. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో గులాబీ సైనికులు, నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చి బలోపేతం చేయాలనే ఆలోచనతోనే కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనాలు, పార్టీ ప్రతినిధుల సభలు నిర్వహిస్తున్నారు.

కార్యకర్తలను కాపాడుకోవాలి

– భానుప్రసాద రావు, ఎమ్మెల్సీ, చీఫ్‌విప్


బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి అభివృద్ధి చేశారో తెలంగాణ రాష్ట్ర బీజేపీ నేతలు చెప్పాలి. బీజేపీ నేతలు అక్కడ అభివృద్ధి చేతగాక ఇక్కడికి వచ్చి నీతి వాక్యాలు చెబుతున్నారు. బీజేపీ పార్టీ కులాలు, మతాల మధ్య కొట్లాట పెట్టడం తప్ప మరేం చేయదన్నారు. కార్యకర్తలు లేకుంటే నాయకుడు, పార్టీ లేదు. కార్యకర్తలను దూరం చేసుకోకుండా కాపాడుకోవాలన్నారు. విభేదాలు ఉన్నా ఒక్కటిగా కలిసి బీఆర్‌ఎస్ పార్టీని ముందుకు నడిపించాల్సిన అవసరముంది.

గెలుపు కోసమే పనిచేయాలి

– దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే

వ్యక్తుల కోసం కాకుండా అందరం కలిసి పార్టీ గెలుపు కోసం పనిచేయాలి. మనందరిదీ ఒక్కటే వర్గం. అదే కేసీఆర్ వర్గం. కొందరు వ్యక్తులు ఇక్కడి మాటలు అక్కడ చెబుతూ.. పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారు. కేసీఆర్ కోసం పని చేసేవారు పార్టీలో ఉండాలి. ద్రోహం చేసే వాళ్లు పార్టీని వీడాలి.

20 ఓట్లు వేయించాలి



బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభకు హాజరైన ఒక్కో ప్రతినిధి 20 ఓట్లు వేయిస్తే రాబోయే ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుంది. సభకు హాజరైన 5వేల మంది ప్రతినిధులు 20 ఓట్లు చొప్పున వేయిస్తే లక్ష మెజార్టీ పెద్దగా కష్టంకాదు. ఇందుకోసం ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా పార్టీ కోసం కృషి చేయాలి.

– కోరుకంటి చందర్, రామగుండం ఎమ్మెల్యే

టికెట్లు అమ్ముకునే దుర్మార్గుడు శ్రీధర్‌బాబు



కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న శ్రీధర్‌బాబు అక్కడి అభ్యర్థుల నుంచి కోట్లు దండుకుని ఇక్కడ ఎన్నికల్లో ఖర్చు పెట్టే ఆలోచనలో ఉన్నాడు. అభ్యర్థుల టికెట్ అమ్ముకునే దుర్మార్గుడు శ్రీధర్‌బాబు. భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్‌గా దళిత బిడ్డ, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌గా బీసీ బిడ్డగా నేను ఉన్నాం. ఇప్పటికీ ఒక్కసారి కూడా జెడ్పీ సమావేశానికి హాజరుకాని చరిత్ర ఇక్కడి ఎమ్మెల్యేది. – పుట్ట మధు, జెడ్పీ చైర్మన్

ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి



కలెక్టర్ సంగీతను కలిసి వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సంగీతను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసి కొన్నిచోట్ల కొట్టుకుపోయిందని, కోయడానికి సిద్ధంగా ఉన్న పొలాల్లో ధాన్యం రాలి నేలపాలైందని పేర్కొన్నారు. తరుగు లేకుండా తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలన్నారు. నష్టపోయిన రైతులను గుర్తించి పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు బి.సురేశ్‌గౌడ్, వేముల రామ్మూర్తి, అన్నయ్యగౌడ్, సారయ్య, ప్రకాశ్‌రావు, మల్లయ్య, శ్రీనివాస్, మహేందర్, సంపత్, మస్రత్, అబ్బయ్య, అక్బర్‌అలీ, కుమారకిషోర్, అవినాష్, రాములు, జానీ, వరప్రదీప్, తూముల సుభాష్‌రావు, శ్రీమాన్, సంతోష్‌రావు, రమేశ్, జగదీశ్, సంతోష్, తిరుమలేశ్ ఉన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న ఉష

సుల్తానాబాద్‌రూరల్: వడగండ్ల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జీ దాసరి ఉష డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో దెబ్బతిన్న పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతేరాజు అంటున్న రాష్ట్రంలో రైతులను పట్టించుకునే నాథుడే లేరని అన్నారు. ఆమె వెంట నాయకులు రియాజ్, మధు, చంద్రశేఖర్, సాయి, రజనీకాంత్, రైతులున్నారు.

ఎన్టీపీసీ సెంట్రల్ ఎన్టీసీ సభ్యుడికి సన్మానం



మల్లేశంను సన్మానిస్తున్న బాబర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సెంట్రల్ ఎన్బీసీ సభ్యులు ఎస్.మల్లేశంను ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా సన్మానించారు. మంగళవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని బాబర్ నివాసానికి మల్లేశం వెళ్లగా.. ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎన్టీపీసీ సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో అన్ని యూనియన్లు కలిసి ముందుకుసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ అనుబంధ ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు కొలిపాక మల్లయ్య, వెంకటస్వామి, కందుల స్వామితో పాటు బీఎంఎస్ నాయకులు వడ్డెపల్లి రాంచందర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధికార్డుల పంపిణీ



ఎంప్లాయ్‌మెంట్ కార్డులు అందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

పెద్దపల్లిరూరల్: ఉద్యోగ, ఉపాధి కోసం ఉపాధి కల్పనాధికారి కార్యాలయం నుంచి పొందే ఎంప్లాయ్‌మెంట్ కార్డులను విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో మంగళవారం అందించారు. విద్యార్థుల అర్హతలను బట్టి టాస్క్ కో–ఆర్డినేటర్ తిరుపతి ఆధ్వర్యంలో నమోదు చేసి ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య చేతులమీదుగా అందించారు. కెప్టెన్ రేల్ల సంజీవ్, కళాశాల సిబ్బంది అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గోదావరిఖనిటౌన్: బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ గోదావరిఖని డిపో మేనేజర్ ఎం. మల్లేశం తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు.. వారి సమస్యలలు పరిష్కరించేందుకు సలహాలు, సూచనలు తీసుకుంటామని, ప్రజలు సెల్ :99592 25922 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు.

మంథనిలో..

మంథని: ఆర్టీసీ మంథని డిపో మేనేజర్‌తో బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. సమస్యలుంటే 99592 25923కి కాల్ చేయాలని సూచించారు.

కూలుతున్న ఎల్లంపల్లి వంతెన ఫుట్‌పాత్



కూలిపోతున్న ఫుట్‌పాత్

రామగుండం: రామగుండంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వంతెనపై ఎడమవైపు ఫుట్‌పాత్ పలుచోట్ల కూలిపోతోంది. దీంతో పర్యాటకులు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. ఫుట్‌పాత్ లోపల విద్యుత్ తీగలు ఉండడం.. దానిపైనుంచి సిమెంట్ కప్పువేయడం.. అది కూలుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. నీటిపారుదలశాఖ అధికారులు గుర్తించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఈపీఎస్–95తో మెరుగైన లాభాలు



సమావేశంలో పాల్గొన్న ఎస్.మల్లేశం

జ్యోతినగర్: ఈపీఎస్–95 పెన్షన్‌తో ఉద్యోగులకు మెరుగైన లాభం జరుగుతుందని ఎన్టీపీసీ సెంట్రల్ ఎన్సీసీ సభ్యులు ఎస్.మల్లేశం అన్నారు. మంగళవారం స్థానిక టెంపరరీ టౌన్‌షిప్ ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈపీఎస్–95కు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీఎఫ్ నుంచి కోత అవుతాయని ఉన్న అనుమానాలు, సందేహాలను నివృత్తి చేశారు. ఉద్యోగులకు లాభం తప్ప నష్టం ఉండదని వెల్లడించారు. రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తానయ్య, ఎన్టీపీసీ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, బూక్యా సోమ్లా, నాయకులు వడ్డెపల్లి రాంచెందర్, సాగర్‌రాజు, నరేందర్, కొమురయ్య పాల్గొన్నారు.







చీరల పందిరి..!

భానుడి ప్రతాపం నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతు వినూత్న ఆలోచన చేశాడు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట నిలువునా ఎండిపోతుండడంతో పాతచీరలు ఒకదానికొకటి చుట్టి చలువ పందిరి మాదిరిగా తయారుచేశాడు. చీరలను ఆరేసినట్టు కనిపిస్తుండడంతో పక్షులు కూడా రావడం లేదంటున్నాడు పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లికి చెందిన చిప్పరాజు అనే రైతు. రహదారి వెంట వచ్చిపోయే వాహనదారులు ఈ చీరల పందిరిని చూస్తూ 'ఉపాయం అదిరింది గురూ..' అంటూ మెచ్చుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

- ఇద్దరికి తీవ్రగాయాలు
- నుజ్జునుజ్జు అయిన బైక్



లారీ ఢీకొనడంతో కుడికాలు పాదం కోల్పోయిన షబ్బీర్

ఫెర్టిలైజర్‌సిటీ: ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లో.. ఆర్‌ఎఫ్‌సీఎల్ గేట్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం ఓ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్.కె షాబీర్ కుడికాలు పాదం విరిగిపోయింది. ఎస్‌కే.ఇస్మాయిల్ గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఇస్మాయిల్, షబీర్ పెంచికల్‌పేట నుంచి ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్ మీదుగా సంజయ్‌గాంధీనగర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో ఆర్‌ఎఫ్‌సీఎల్ మెటీరియల్ గేట్‌కు యాష్ లోడ్ కోసం వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా రాంగ్ రూట్‌లోకి తిప్పడంతో ద్విచక్ర వాహనదారులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఇస్మాయిల్‌కు గాయాలు కాగా వెనక కూర్చున్న షాబీర్ కాలుకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. షాబీర్ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎన్టీపీసీ ఎస్సై జీవన్‌ను సంప్రదించగా.. ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

విజిలెన్స్ నియామకం ఎప్పుడో..?

- రేషన్ సరుకులపై కొరవడిన పర్యవేక్షణ
- మండలంలో 45 దుకాణాలు, కార్డులు



రేషన్ దుకాణం

ధర్మారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తున్న బియ్యం పంపిణీ పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కమిటీ (విజిలెన్స్)లు నామ మాత్రమయ్యాయి. రేషన్ దుకాణాల పర్యవేక్షణకు డివిజన్, మండలస్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటుచేసి ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై బియ్యం నాణ్యత.. పంపిణీ తీరు.. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీల్లో అందిస్తున్న పౌష్టికాహారం తదితర అంశాలపై చర్చించాలి. పంపిణీ అందించటంలో లోపాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలి. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఆహార సలహా సంఘాలను రద్దు చేసి విజిలెన్స్ కమిటీలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఇప్పటివరకు డివిజన్, మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మండలంలో 31 రేషన్‌దుకాణాలున్నాయి. వీటి పరిధిలో 16,345 రేషన్‌కార్డులున్నాయి. ఇందులో అన్నపూర్ణ కార్డులు 19, ఏఎఫ్ఎస్‌సీ కార్డులు 1,028 కార్డులు, ఎఫ్ఎస్‌సీ కార్డులు 15,298 కార్డులున్నాయి. ఈ దుకాణాల నిర్వాహణపై విజిలెన్ కమిటీల పర్యవేక్షణతో పాటు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. కమిటీల పర్యవేక్షణ లేనికారణంగా నాణ్యత ప్రమాణాలపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. పాఠశాలలకు సైతం నాణ్యమైన బియ్యం సరఫరా కావటం లేదు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం గురించి పట్టించుకునే వారు లేకపోయారు.

కమిటీలు ఇలా..

జిల్లాస్థాయి కమిటీలకు కలెక్టర్, డివిజన్ స్థాయి కమిటీలకు ఆర్డీఓ, మండలస్థాయి కమిటీకి తహసీల్దార్, ఎంపీపీ చైర్మన్లుగా ఉంటారు. దీంతోపాటు జెడ్పీటీసీతోపాటు ముగ్గురు మహిళా ప్రతినిధులు, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి, ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు రేషన్ డీలర్లు, రాజకీయ పార్టీల నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారు.

విజిలెన్స్ కమిటీలు వేయలేదు



మండలంలో ఇప్పటివరకు విజిలెన్స్ కమిటీలు వేయలేదు. గతంలో కార్డుల ద్వారా బియ్యం పంపిణీ చేయటంతో అవకతవకలకు అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అమలవుతోంది. రేషన్ దుకాణాలపై నిఘా పెంచి పంపిణీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు జారీ చేస్తే మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తాం. – శ్రీనివాస్, తహసీల్దార్, ధర్మారం

బ్యాగ్ అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది



ప్రయాణికుడికి బ్యాగ్ అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

మంథని: మంథని నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు మర్చిపోయిన బ్యాగ్‌ను తిరిగి అప్పగించారు. మంథని డిపోకు చెందిన బస్సులో ఓ ప్రయాణికుడు కరీంనగర్ వెళ్లాడు. అందులో బ్యాగ్ మర్చిపోయాడు. ఆయన చూసుకునేలోపే ఆ బస్సు మళ్లీ మంథనికి బయల్దేరింది. అయితే వెనుకాలే వచ్చిన బస్సు కండక్టర్ ఐలయ్యను సంప్రదించగా.. ఆయన మంథని బస్టాండ్ కంట్రోలర్ రాజిరెడ్డికి సమాచారం ఇచ్చాడు. సదరు బస్సు కండక్టర్ ఎల్‌జేఆర్.రావుకు ఫోన్ చేశాడు. బస్సులో మర్చిపోయిన బ్యాగ్‌ను సదరు బాధితుడికి అప్పగించారు.

ఉరేసుకుని ఒకరి మృతి

గోదావరిఖని: స్థానిక జీఎం కాలనీకి చెందిన నీలం కుమార్(53) ఉరేసుకుని మంగళవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్ జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వేణు తెలిపారు.

ఆల్ ఇండియా రెడ్డి సంఘం జిల్లా కార్యదర్శిగా అంజిరెడ్డి



అంజిరెడ్డి

ధర్మారం: ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ధర్మారం మండలం బంజేరుపల్లి గ్రామానికి చెందిన ఏనుగు అంజిరెడ్డిని నియమిస్తూ సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డిల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానని అంజిరెడ్డి అన్నారు. తన నియమకానికి కృషిచేసిన రెడ్డి సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌తో సింగరేణి డైరెక్టర్ల సమావేశం



కలెక్టర్‌తో సమావేశమైన డైరెక్టర్లు

గోదావరిఖని: సింగరేణి ప్రాజెక్టుల విస్తరణ, భూ అనుమతులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కోసం మంగళవారం జిల్లాలోని అన్ని ఏరియాల జీఎంలు, డైరెక్టర్లు కలెక్టర్ సంగీతతో సమావేశమయ్యారు. ఓసీపీలు, భూగర్భగనుల విస్తరణలో భాగంగా రీజియన్‌లోని పలు అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సింగరేణి డైరెక్టర్(పా) బలరాం, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం మనోహర్, ఆర్జీ–3 జీఎం టీవీ.రావు, ఏస్టేట్ జీఎం రవిప్రసాద్, మంథని, పెద్దపల్లి ఆర్డీవోలు పాల్గొన్నారు.

ప్రత్యేక రోడ్డు వేయాలని కార్మికుల ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

గోదావరిఖని: జీడీకే–11గనిలో విధులు నిర్వహిస్తున్న తమ కోసం ప్రత్యేక రోడ్డు వేయాలని కోరుతూ మంగళవారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. రోడ్డైనా వేయాలని, లేకుంటే ప్రస్తుతమున్న రోడ్డును పునరుద్ధరించాలని సూచించారు. గనిలో రెండు వేల మంది కార్మికులు పనిచేస్తారని, గోదావరిఖని, విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేశ్‌నగర్, ద్వారకనగర్, పరుశురాంనగర్, లాల్‌బహదూర్‌నగర్ ప్రాంతాల నుంచి వస్తారని, రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. సింగరేణి జీడీకే–5 ఓసీపీ ఏర్పాటుతో పాతరోడ్డును పూర్తిగా మూసివేశారని, ఫలితంగా జీడీకే–2వ గని మీదుగా వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. దూరభారం పెరిగిందని, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని తెలిపారు.

చర్చలకు అన్ని యూనియన్లనూ ఆహ్వానించాలి

- కార్మిక సంఘాల నాయకుల డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించే వరకూ అన్ని యూనియన్లతో చర్చించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్‌లో అన్ని యూనియన్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో ఎన్నికలు జరిగి ఆరేళ్లు గడుస్తోందని, తిరిగి ఎన్నికల నిర్వహణ జాడలేకుండా పోయిందన్నారు. కాలపరిమితి ముగిసినా.. టీబీజీకేఎస్‌కు యాజమాన్యం అక్రమంగా గుర్తింపునిస్తోందన్నారు. మిగతా యూనియన్లకు కార్మికుల సమస్యలపై మాట్లాడే కనీస హక్కును కూడా నిరాకరిస్తోందన్నారు. సేఫ్టీ, మైన్స్ కమిటీ, ఇతర సంక్షేమ, కంపెనీ స్థాయిలో నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో అన్ని యూనియన్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, రవి. శ్రీరాములు, నారాయణ, మెండె శ్రీనివాస్, అశోక్‌చక్రవర్తి, దేవులపల్లి రాజేందర్, బండారి మొగిలి, తుమ్మ గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీసు



ఎలిగేడు: ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎలిగేడు/ధర్మారం: తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని, లేనిపక్షంలో ఈనెల 28నుంచి నిరవధిక సమ్మె చేస్తామంటూ మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు నోటీసు అందించారు. జేపీఎస్, ఓపీఎస్ కార్యదర్శులు అందరూ నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయినా రెగ్యులరైజేషన్ చేయలేదని, ఆదేశాలు ఇచ్చేవరకూ సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ధర్మారంలో కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు మాట్లాడుతూ 25న డీఎస్ఆర్ ఆప్ బహిష్కరణ, 26న జిల్లా, మండల స్థాయిలో అధికారిక వాట్సప్ గ్రూప్‌ల నుంచి వైదొలుగుట, 27న జిల్లా కేంద్రాలలో ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత, 28 నుంచి సమ్మెకు వెళ్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ బాలాజీ గోల్డ్. మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-43]

TRAINING

■ శ్రీ మా కలర్స్ బ్యూటి పార్లర్ వారి Short Term Summer Training Courses, ఫీజు: 7500/–, టవర్‌సర్కిల్, కరీంనగర్. ప్రొ॥ టి.రజిత, సెల్: 9866004268, 9502292232 [K-1219985]

WANTED

■ స్పాట్ జాయినింగ్ MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, షాపింగ్ మాల్స్ లో క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూం+భోజనం ఫ్రీ, జీతం: 15,000 నుండి 30,000/- వరకు. ఫోన్ : 6281642922 [HA-10937]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్: 9848571888 [H-793420]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కుమారస్వామి, నాయకులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వేల్పుల కుమారస్వామి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఇందిరమ్మకాలనీలోని ప్రభుత్వ భూమిలో అధికార కార్పొరేటర్ కొంతమంది బినామీలతో భూకబ్జాకు పాల్పడుతున్నాడని, అధిక ధరలకు విక్రయిస్తున్నాడని ఆరోపించారు. నకిలీపత్రాలు సృష్టించి రాత్రికిరాత్రే నిర్మాణాలు చేపట్టడం.. వాటిని అధిక ధరలకు విక్రయించడం దినచర్యగా మారిందన్నారు. పేదలకు అన్యాయం చేయాలని చూస్తున్న కార్పొరేటర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎం.రామాచారి, ఎస్.భిక్షపతి, నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, మల్లేశ్, కనకయ్య, ఉపేందర్, దేవేంద్ర, నర్సింగరావు, భాగ్య, సుజాత, స్వప్న, సంపత్, సాయి మాధవి, సరిత పాల్గొన్నారు.



కాలనీలో కురుస్తున్న వర్షం



అంధకారంలో అల్లూరు

అంధకారంలో యైటింక్లయిన్‌కాలనీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలో మంగళవారం సాయంత్రం అరగంటపాటు వర్షం కురిసింది. అల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ఏరియాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బందికి స్థానికులు సమాచారం అందించగా.. ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య ఉందని తెలిపి వెళ్లిపోయారు. దీంతో చేసేది లేక గ్రామస్తులు రాత్రి అంతా అంధకారంలోనే మగ్గారు. ఓ వైపు దోమలు.. మరోవైపు చీకటి.. ఉక్కపోతతో విలవిలలాడారు.

గోడకూలి ఒకరికి గాయాలు



గాయపడ్డ శ్రీనివాస్

మంథని: మంథనిలోని కేడీసీసీ బ్యాంకు పక్కన నివాముండే బోయిని శ్రీనివాస్ ఇంట్లో నిద్రిస్తుండగా పక్కనే నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి గాయపడ్డాడు. భారీ ఈదురు గాలులకు గోడ ఇంటిపై పడడంతో ఇళ్లకప్పులు విరిగి బండరాళ్లు ఛాతిభాగంలో పడ్డాయి. అతడిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. శ్రీనివాస్ భార్య 15 రోజుల క్రితం మృతి చెందింది.